క్లుప్తంగా

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

చెరుకుపల్లి: గూడవల్లిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్ని శుక్రవారం నుంచి తొమ్మిదో తేదీ గురువారం వరకు నిర్వహించనున్నట్లు ఈవో జంజనం సాంబశివరావు తెలిపారు. 3న విష్వక్సేన పూజ, అంకురార్పణ, 4న శేష వాహన సేవ, 5న సింహ వాహన సేవ, 6న ఎదుర్కోలోత్సవం, స్వామి కల్యాణోత్సవం, 7న గరుడ ఉత్సవం, రథోత్సవం, 8న వసంతోత్సవం, 9న ద్వాదశ ప్రదక్షిణలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీ దుర్గా జీవేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

చెరుకుపల్లి: మండలంలోని రాజవోలులో గురువారం శ్రీ దుర్గా జీవేశ్వరస్వామి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామిని పెండ్లి కుమారుని చేసి, ధ్వజారోహణం చేసినట్లు ఈవో శ్రీనివాసవర్మ తెలిపారు. 3న గ్రామోత్సవం, నెమలి వాహన సేవ, 4న శేష వాహన సేవ, 5న స్వామి కల్యాణం, 6న నందివాహన సేవ, మధ్యాహ్నం అన్నదానం, 7న ద్వాదశ ప్రదక్షిణ, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలపై కేంద్రం పెనుభారం

బాపట్ల అర్బన్: గ్యాస్ ధరను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెనుభారం మోపిందని కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సిలిండర్‌పై రూ. 50 పెంచడాన్ని నిరసిస్తూ పాత బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరాజ్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు రేణుక, నేతలు నళిని, ఎస్.వి.ఆర్.కుమార్, జగదీష్ శర్మ, నక్కల రాంబాబు, శీలం సాగర్, కట్టా లాజర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

9న ఆలపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

చుండూరు(భట్టిప్రోలు): ఆలపాడులోని కృపా మందిరం ఆవరణలో ఎల్వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ (గూడవల్లి) సౌజన్యంతో ఈ నెల 9న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేం రాజు గురువారం తెలిపారు. ఈ శిబిరంలో వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రముఖ కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. శుక్లాలు ముదిరిన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయించనున్నట్లు తెలిపారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తామని చెప్పారు. కంటి పరీక్షలకు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

చినపరిమిలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి సచివాలయంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వేటపాలెం పీహెచ్‌సీ వైద్యులు రవి ప్రకాష్ వైద్య శిబిరం నిర్వహించారు. 82 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌లో 70 రకాల మందులు, 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే నాయబ్ రసూల్, సీహెచ్‌వో వి. పుష్పరత్నం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, శివ పార్వతి, సీతారావమ్మ, సుభాషిణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ మురళి, మొబైల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేల కూలిన ధ్వజ స్తంభం

రేపల్లె రూరల్: మండలంలోని నల్లూరులో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో గురువారం ఆకస్మికంగా ధ్వజ స్తంభం నేల కూలింది. దీన్ని ఆలయంలో ఏర్పాటు చేసి ఐదేళ్లే అయింది. అతి తక్కువ కాలంలో నేల కూలడంతో గ్రామస్తులు భిన్నరకాలుగా చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఈవో రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ పాలక మండలితో పాటు దేవదాయ అధికారులతో చర్చించి త్వరలో ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

గ్రామ సచివాలయం తనిఖీ

పిట్టలవానిపాలెం: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ సుధారాణి తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ 20 సర్వీసులకు తక్కువ కాకుండా నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు.అనంతరం గ్రామ సచివాలయ రికార్డుల్ని పరిశీలించారు.

రెడ్‌క్రాస్ ప్యాట్రన్‌గా డీన్ శ్రీనివాసరావు

బాపట్ల: ఇండియన్ రెడ్‌క్రాస్ ప్యాట్రన్‌గా బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు చేరారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బి.ఎస్. నారాయణభట్టుకు ఆయన రూ.25100చెక్కును అందించారు. రెడ్‌క్రాస్‌లో ప్యాట్రన్‌గా చేరడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు నూరు శాతం పరిష్కారమే లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



బేతపూడిలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడిలో గురువారం నాలుగో రోజు ఆయన పర్యటించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని వివరించడంతో పాటు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల్ని నూరు శాతం పరిష్కరించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయాలకు మంజూరైన నిధులతో అంతర్గత రహదారుల్ని నిర్మించడంతో పాటు ప్రత్యేక నిధులతో గ్రామాల్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజలు నిర్భయంగా సమస్యలంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా 210 గృహాల్ని పర్యటించి, వారికి ప్రభుత్వ లబ్ధి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ ఆలూరి పద్మ, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కొమరాబత్తుని జయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సైకిళ్ల పంపిణీని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లె: దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సూచించారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆర్‌బీటీ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు పేటేరులోని పరుచూరి బలరామయ్య మెమోరియల్ హైస్కూలు విద్యార్థులకు గురువారం నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో ఎక్కువ మంది పేదలే ఉంటారన్నారు. వారికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు సహకారాన్ని అందించడం అభినందనీయమన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 6, 7 తరగతుల విద్యార్థులు 172 మందికి సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, డాక్టర్లు వసంతం వీరరాఘవయ్య, ఆకురాతి వెంకట సుబ్బారావు, ఎంఈవో నవీన్‌కుమార్, ఆకురాతి వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి రవికిరణ్, హెచ్‌ఎం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత యలవర్తి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణ

కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని కూచిపూడిలో గురువారం వైఎస్సార్ సీపీ నేత యలవర్తి రామ్మోహనరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా నేతలు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి రామ్మోహనరావు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. మండలంలో పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బాపట్ల జిల్లా ఉడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ నరేంద్ర, గ్రామ సర్పంచ్ కొండమూది శ్యామలాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు మూల్పూరు లావణ్య, సొసైటీ అధ్యక్షుడు యలవర్తి సురేష్, జి. అశోక్, భూషణయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



పెసర్లంక(భట్టిప్రోలు): జెడ్పీ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి కొనియాడారు. భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ విద్యార్థుల చదువుపై మరింత దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అత్యుత్తమమైన ఆధునిక విద్య అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌కే మహబూబ్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు నన్నెపాముల చంటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్య రక్షణ పద్ధతులతోనే వేరుశనగలో తెగుళ్ల నివారణ



లింగార్షక బుట్టలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రమాదేవి

పేరలి(కర్లపాలెం): వేరుశనగకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి రైతులకు సూచించారు. పేరలిలో గురువారం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. తొలుత శాస్త్రవేత్తలతో కలసి వేరుశనగ పైర్లను ఆమె పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ రమాదేవి మాట్లాడుతూ వేరుశనగలో పొగాకు లద్దే పురుగు అధికంగా ఉందని, నివారణకు 5శాతం వేప గింజల కషాయం పైరుపై పిచికారీ చేయాలని చెప్పారు. పంట పొలం గట్లపై అక్కడక్కడా ఎర పంటగా ఆముదం మొక్కలు నాటాలని సూచించారు. పురుగు గుడ్డు దశలోనూ, లార్వా దశలోనూ ఉన్నప్పుడు ఎకరాకు 400 గ్రాముల మాంకోజబ్, 200 గ్రాముల కార్బండిజం, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పైరులో జింకు లోపం నివారణకు జింకు సల్ఫేట్ నీటిలో కలిపి స్ప్రే చేయాలని తెలిపారు. తెగుళ్లను తట్టుకునే రకాలైన కదిరి హరితాంధ్ర, నిత్య హరిత, కదిరి లేపాక్షి రకాలను సాగు చేయాలని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, సి.సంధ్యారాణి, ఎస్.కిరణ్‌కుమార్, విజయప్రకాష్, సిద్ధార్థ నాయక్, బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి, డీడీఏ విజయనిర్మల, ఏవో సుమంత్‌కుమార్, ఏవో డీఆర్‌సీ ఉమామహేశ్వరి, వ్యవసాయ సహాయకులు తిరుమలేశ్వరరావు, ఏఈవో భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



రేపల్లె: మండలంలోని పెనుమూడిలో గురువారం అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రావి సాంబశివరావు ఇంటి ఆవరణలో ఉన్న 10 ఎకరాల గడ్డి అగ్నికి ఆహుతైంది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపకశాఖ అధికారి వై.వెంకటేశ్వరరావు తెలిపారు. సుమారు రూ.1లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు.

సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసారథి

అద్దేపల్లి(భట్టిప్రోలు): గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థసారథి సూచించారు. భట్టిప్రోలు సచివాలయం-2ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న సేవల్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డుల్ని పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, పని వేళలు, హాజరుశాతం వంటి పలు అంశాల్ని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సచివాలయం కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి మాణిక్యం, ఆర్‌ఐ శివరామకృష్ణ, వీఆర్వో అంబటి ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాగర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శేష వాహనంపై ఊరేగిన శ్రీ రామలింగేశ్వరస్వామి



చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలోని శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి నవాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామికి గురువారం ఉదయం, సాయంత్రం నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాల్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా స్వామి రాత్రి శేష వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఎదురేగి దివ్య నీరాజనాలు పలికారు. కార్యక్రమాల్నిదేవాలయ కార్యనిర్వహణాధికారి ఈమని అశోకరెడ్డి పర్యవేక్షించారు.

నగల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బాపట్ల టౌన్: ఇంటిని శుభ్రం చేస్తూ, నగల చోరీ చేసిన కేసులో వ్యక్తిని వెదుళ్లపల్లి పోలీసులు అరెస్టు చేశారు. బాపట్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ జి. వేణుగోపాలరెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని మురుకుంటపాడుకు చెందిన కాక రాజేంద్రప్రసాద్ ఇంటిని శుభ్రం చేసేందుకు అదే గ్రామంలోని చల్లా విజయ్‌ను ఈనెల 28న పనిలో పెట్టుకున్నారు. ఇటీవల రాజేంద్రప్రసాద్ తల్లి బంగారు వస్తువుల్ని ఇంట్లోని పరుపు కింద పెట్టి స్నానానికి వెళ్లారు. వచ్చి చూసే సరికి అవి మాయం కావడంతో రాజేంద్రప్రసాద్ వెదుళ్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్‌ఐ నాగశ్రీను, సిబ్బందితో ముద్దాయి చల్లా విజయ్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.3,20,000 విలువైన 8.5 సవర్ల మూడు బంగారపు గాజులు, నాంతాడును స్వాధీనం చేసుకొన్నారు.ఈ మేరకు ముద్దాయి చల్లా విజయ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ నాగశ్రీను, సిబ్బంది ఏ.నరసింహమూర్తి, షరీఫ్ పాల్గొన్నారు.

పేదలపై భారాలు మోపడం తగదు : సీపీఎం



నిరసనలో పాల్గొన్న సీపీఎం నాయకులు

రేపల్లె: కేంద్రం నిత్యం ధరల్ని పెంచుతూ పేదలపై భారాలు మోపడం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించాలని కోరుతూ పట్టణంలోని నెహ్రూ బొమ్మ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల పొట్టగొట్టి కార్పొరేట్లు అంబానీ, అధానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ ధర ఇప్పుడు రూ.1200కు పెరిగిందని తెలిపారు. గ్యాస్ ధరల్ని ప్రభుత్వం తగ్గించకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు వై. కిశోర్‌బాబు, జి.దానియేలు, డి.బాబూరావు, డి.శ్రీనివాసరావు, ఎల్.వెంకట్, ఎం.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



బాపట్ల అర్బన్: నియోజకవర్గంలోని వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన బందారు ఉమామహేశ్వరరావు గత ఏడాది నవంబరులో హర్యానాలోని కర్నల్‌లో జరిగిన యూత్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని మూడో స్థానాన్ని సాధించాడు. బంగ్లాదేశ్‌లోని డాఖాలో ఈ నెల 14 నుంచి 18వరకు జరిగే ఇంటర్నేషనల్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరఫున పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి కార్యకర్తల సహకారంతో పార్టీ తరఫున రూ. 51,116 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులు చిలకల సురేంద్రబాబు, కారుమూరి అంజనేష్, కత్తి నాగలక్ష్మి, బండ్రెడ్డి రజని, వడ్రాణం బ్రహ్మం పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆధ్వర్యంలో పారదర్శక పాలన

మంత్రి నాగార్జున



బలిజేపల్లిలో సంక్షేమ పథకాలు గురించి మహిళను అడిగి తెలుసుకుంటున్న మంత్రి నాగార్జున

వేమూరు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పైసా కూడా దుర్వినియోగం కాకుండా పరిపాలన చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. మంత్రి ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ అధ్వానంగా ఉన్నాయని, వాటిని వెంటనే వేయించాలని మంత్రి దృష్టికి పలువురు తీసుకెళ్లారు. నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దుర్వినియోగం చేయకుండా సంక్షేమ పథకాల ద్వారా ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల అకౌంట్‌లో జమ చేస్తున్నారని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులు ఆనందంతో ఉన్నారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పుష్కలంగా పండుతూ రైతులు సుభిక్షంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, గ్రామ సర్పంచ్ బొజ్జ వెంకయమ్మ, సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్, ఎంపీటీసీ సభ్యురాలు కొండూరు లక్ష్మీ నాగరాజ కుమారి, బొల్లిముంత ఏడుకొండలు, కోగంటి లవకుమార్, గుండాల ప్రతాప్, జల్లి ఏబు, కంచర్ల సుశీలరావు, బెల్లంకొండ శివపార్వతి, రాయపూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయపూడి బుజ్జిబాబు, కస్తూరి సాంబశివరావు, పరిశ రామయ్య, కొండిశెట్టి రాంబాబు, గాజుల మోహన్, విష్ణుమొలకల వెంకట రెడ్డియ్య, దున్నా మేరీ సుబాబు, దాసరి ముత్తయ్య, తలతోటి ప్రదీప్, కుంపటి దావీదు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు సహనం, చిరునవ్వుతో సేవలందించండి



చాట్రగడ్డలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి విలియమ్స్

రేపల్లె రూరల్: సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది సహనంతో సేవల్ని అందించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి విలియమ్స్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో జగనన్న గోరుముద్ద పథకం, సచివాలయ కేంద్రాల పరిశీలనలో భాగంగా గురువారం మండలంలోని చాట్రగడ్డ గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజల్ని చిరునవ్వుతో స్వాగతించి అర్జీల్ని స్వీకరించాలని తెలిపారు. అర్జీల్ని త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. సచివాలయం పరిధిలో పరిష్కారం పొందని సమస్యల్ని ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారాలకు మార్గాలు చూపాలని సూచించారు. ప్రతి రోజు జరిగే స్పందన కార్యక్రమంలో ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. సచివాలయాలలో నిర్వహించే పనుల వివరాల్ని రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల వివరాల్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. అనంతరం రికార్డుల్ని పరిశీలించారు.

బ్రిస్బేన్ విద్యార్థులతో ఐలవరం విద్యార్థుల ముఖాముఖి



బ్రిస్బేన్‌లోని పబ్లిక్ స్కూలు విద్యార్థులతో మాట్లాడుతున్న ఐలవరం హైస్కూల్ విద్యార్థి

ఐలవరం(భట్టిప్రోలు): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులతో ఆంగ్లోపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ గత కొద్ది సంవత్సరాలుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్చువల్ విధానం ద్వారా నిత్యం వివిధ దేశాల్లోని పాఠశాలల విద్యార్థులు, విద్యా ప్రముఖులతో ఆన్‌లైన్‌లో ఇంగ్లిష్‌లో మాట్లాడిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆస్ట్రేలియా క్వీన్స్ లాండ్ రాష్ట్రం బ్రిస్బేన్‌లోని పబ్లిక్ స్కూలు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలు, ట్యాబ్‌ల వినియోగం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఏకరూప దుస్తులు, అమ్మఒడి పథకాలపై ఆస్ట్రేలియా విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఐలవరం హైస్కూలులో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాల్ని ప్రశంసించారు. విద్యార్థులపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను వారు కొనియాడారు. వర్చువల్ క్లాసుల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేటివ్ స్కిల్స్ పెంపొందుతాయని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న హరికృష్ణ తెలిపారు. ఆస్ట్రేలియాలోని సైన్స్ ఉపాధ్యాయుడు గ్రేగ్ క్రీస్ట్ సహకారం అందించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

వైభవంగా భట్టిప్రోలు తిరునాళ్ల ప్రారంభం



బిందె తీర్థంలో పాల్గొన్న ఈవో, పద్మశాలీయ సంఘీయులు



రథాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న వేమూరు సీఐ వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి బ్రహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి కల్యాణ మహోత్సవాలే భట్టిప్రోలు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం బిందె తీర్థం, అభిషేకాలు, రాత్రి నిత్య హోమం, బలిహరణ అనంతరం ధ్వజారోహణ నిర్వహించారు. ధ్వజపటిని దాత, కీర్తిశేషులు పంచుమర్తి రత్నం, నాగభూషణం కుటుంబీకులు సమర్పించారు. పూజల్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. బిందె తీర్థం జగ్గారపు సూర్యనారాయణ-సామ్రాజ్యం దంపతులు, అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం యథాప్రకారం బిందె తీర్థం, అభిషేకం, నిత్యహోమం, బలిహరణ, రాత్రి పుష్ప సేవ జరుగుతుందని ఆయన వివరించారు.

రథోత్సవానికి పటిష్ట బందోబస్తు

బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి దివ్య రథోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు వేమూరు సీఐ కె. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 6న పురవీధుల్లో కల్యాణ మల్లేశ్వరుడి రథోత్సవం పురస్కరించుకుని గురువారం ఆయన భట్టిప్రోలు వచ్చారు. దేవాలయం, రథాన్ని పరిశీలించారు. రథోత్సవంలో భాగంగా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చుండూరు, వేమూరు సర్కిల్ పరిధిలోని అమృతలూరు, చుండూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని ఎస్‌ఐలు, సిబ్బంది, స్పెషల్ బృందాలు బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. స్వామి దేవాలయం వద్ద రెండు రోజుల పాటు పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పద్మశాలీయ సంఘీయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.